# జ్ఞానస్నానము మరియు తైలాభిషేకము
## (ధృవీకరణ సంస్కారము)

ఆదిలాబాద్ గురుపీఠం

మొదటి ముద్రణ : సెప్టెంబర్ 2021
ప్రతులు : 1000

ముద్రణానుమతి

మహా ఘన ప్రిన్స్ అంతోని తండ్రి గారు

ఆదిలాబాద్ గురుపీఠ మేత్రాణులు

***

ఆదిలాబాద్ గురుపీఠ విశ్వాసుల ఉపయోగార్థమై

ఈ ప్రార్థన పుస్తకము ముద్రించబడినది

ప్రతులకు సంప్రదించండి

జీవస్వరం
బిషప్స్ హౌస్
మంచిర్యాల– 504 208
జిల్లా: మంచిర్యాల, తెలంగాణ
ఫోన్ : 9398764408

Jeevaswaram
Bishop's House
Mancherial - 504 208
Dist. Mancherial, T.S.
Cell : 9398764408

# జ్ఞానస్నానము మరియు
# తైలాభిషేకము (ధృఢీకరణ సంస్కారము)

## నిర్దేశములు

1. దేవాలయ ముఖ్య ప్రవేశ ద్వారము వద్ద సంస్కార పరిచర్య ప్రారంభమగును. అభ్యర్థి జ్ఞానతల్లిదండ్రులు, ఇతరులు అక్కడ నిలబడుదురు.

2. గత జ్ఞానస్నానములో ఉపయోగించిన తైలముతో ప్రథమ లేపనము చేయాలి.

3. సాధారణంగా జ్ఞానస్నాన సమయంలోనే తైలమును ఆశీర్వదించాలి. జ్ఞానస్నాన తైలం/రెండవ అభిషేకానికి వాడుకునే తైలమును పవిత్ర మూరోనుతో ఆశీర్వదించాలి. ఒలీవు నూనె, కొబ్బరి నూనె మొదలైన నూనెలు తైలముగా ఉపయోగించవచ్చు.

4. అత్యవసర సందర్భాల్లో తప్ప ఆ యా జ్ఞానస్నానానికి అవసరమైన జలం ఆయా సమయములో ఆశీర్వదించాలి.

5. జ్ఞానస్నాన అభ్యర్థి పొందుకునే తెల్లని వస్త్రం, బైబిలు మరియు క్రొవొత్తి మేత్రాసన కార్యాలయం నుండి లభ్యమవుతాయి.

6. గురువు అభ్యర్థిని నీటిలో మూడు సార్లు ముంచి లేపుతూ/ లేక నీటిలో కూర్చుండబెట్టి శిరస్సుపై మూడు సార్లు సిలువాకారములో నీళ్ళు పోస్తూ / లేక శిరస్సుపై మూడు సార్లు సిలువాకారములో నీళ్ళు పోస్తూ జ్ఞానస్నానము ఇవ్వవచ్చును.

7. సాధ్యమైనంత వరకు జ్ఞానస్నానంతో లేదా జ్ఞానస్నానం తరువాత సాధ్యమైనంత త్వరగా దివ్యసత్ప్రసాదం ఇవ్వాలి.

8. జ్ఞానస్నానముతో పాటు తైలాభిషేకం పొందని వారు ఉన్నట్లయితే, దివ్యబలి క్రమములోని ప్రారంభ ప్రార్థనలు, పఠనాలు, ప్రసంగం తరువాత, ఈ పుస్తకములోని పేజి 19లోని వేడుదల నుండి పేజి 24లోని సమాపనాశీర్వాదం వరకున్న క్రమమును ఉపయోగించవచ్చును.

9. దివ్యపూజాబలితో పాటు జ్ఞానస్నాన సంస్కార పరిచర్య జరిగే సమయంలో– దేవాలయంలో ప్రవేశించిన తరువాత "మా ప్రభువైన దేవా, మీ ప్రేమ పరిమళము మమ్మావరించి" అనే ప్రార్థనతో దివ్యపూజాబలి కొనసాగించవచ్చు. దివ్యబలి మొదటి నుండి మరల ప్రారంభించనక్కరలేదు.

10. జ్ఞానస్నానం మరియు తైలాభిషేకంలో ఉపయోగించే తైలములు

మొదటిది – గత జ్ఞానస్నానంలో అభిషేకించిన తైలం – నొసటిమీద పూయవలెను

రెండవది – ఆ యా జ్ఞానస్నాన సంస్కార పరిచర్యలో ఆశీర్వదించే తైలం– శిశువులకు ఛాతి మీద/పెద్దలకు నొసటి మీద పూయవలెను

మూడవది – పవిత్ర మూరోను తైలం – తైలాభిషేక సంస్కార పరిచర్యలో నొసటి మీద పూయవలెను

# జ్ఞానస్నానము మరియు
# తైలాభిషేకము (దృఢీకరణ సంస్కారము)

(దేవాలయ ముఖద్వారం నుండి అనుష్ఠాన క్రమం ప్రారంభమగును. జ్ఞానతల్లిదండ్రులు, ఇతర సభ్యులు ద్వారం దగ్గర నిలబడుదురు).

గురువు : మహోన్నత స్థలములో దేవునికి మహిమ (3)

అందరు : ఆమెన్ (3)

గురువు : భూలోకములో మానవులకు శాంతి, ఆశాభావము సదా కలుగును గాక.

అందరు : ఆమెన్.

గురువు : పరలోకమందున్న మా తండ్రీ,

(అందరు) మీ నామము పూజింపబడునుగాక. మీ రాజ్యము వచ్చును గాక. మీరు పరిశుద్ధులు, పరిశుద్ధులు, పరిశుద్ధులు. పరలోకమందున్న మా తండ్రీ, పరలోక భూలోకములు మీ మహిమతో నిండి యున్నవి. మీరు పరిశుద్ధులు, పరిశుద్ధులు, పరిశుద్ధులు అని దేవదూతలు, మానవులు స్తుతించుచున్నారు. పరలోకమందున్న మా తండ్రీ, మీ నామము పూజింపబడును గాక. మీ రాజ్యము వచ్చునుగాక, మీ చిత్తము పరలోకమందు నెరవేరునట్లు భూలోకమందును నెరవేరునుగాక. నానాటికి కావలసిన మా అన్నము, మాకు నేటికివ్వండి. మా వద్ద అప్పు బడినవారిని మేము మన్నించునట్లు, మా అప్పులను మీరు మన్నించండి. మమ్ము శోధన యందు ప్రవేశింపనీయక, కీడులోనుండి మమ్ము రక్షించండి. ఏలయన నిరంతరము మీదే రాజ్యము, మీదే అధికారము, మీదే మహిమ, ఆమెన్.

పరిచార : ప్రార్థించుదము, సమాధానము మనతో ఉండును గాక.

గురువు : ప్రభువైన దేవా, మీ అనుగ్రహమును కోరి వచ్చిన ఈ దాసుని/దాసిని/దాసులను మీ మందలో చేర్చుకొని, మీ కృపావరములతో ప్రకాశింపజేయండి. నీటి వలన, ఆత్మ వలన మరల జన్మించి "తండ్రీ" అని మిమ్ము సంబోధించు యోగ్యతను ఈ దాసునికి/దాసికి/దాసులకు అనుగ్రహించండి. ఈ సంస్కారమును పవిత్రముగా నిర్వహించుటకు బలహీనులమైన మమ్ము శక్తిమంతులనుగా చేయండి. నిత్యం పిత, పుత్ర, పవిత్రాత్మ సర్వేశ్వరా.

అందరు : ఆమెన్.

## కీర్తన 42

గురువు : ప్రభూ, దప్పిగొనిన దుప్పి సెలయేటి నీటి కొరకు వలె,
నా హృదయము నీ కొరకు తపించుచున్నది.

(కానోన) ఒకడు నీటి వలన ఆత్మ వలన జన్మించిననే తప్ప దేవుని
రాజ్యములో ప్రవేశింపలేడు

అందరు : ప్రభూ, దప్పిగొనిన దుప్పి సెలయేటి నీటి కొరకు వలె,
నా హృదయము నీ కొరకు తపించుచున్నది.

గురువు : సజీవుడగు దేవుని దర్శింప నా ఆత్మ ఆరాట పడుచున్నది

అందరు : దివారాత్రములు నా కన్నీళ్ళే నాకు ఆహారమైనవి
నేనెప్పుడు నా ప్రభుని దర్శింతును

గురువు : నా ఆత్మమా నీవు విచారము చెందనేల?
నీ దేవుని నీవు ఆశ్రయించుము

అందరు : నా ఆత్మ కలత చెందియున్నది
నా రక్షకుడైన దేవుని నేను కీర్తించెదను

గురువు : పగటి వేళ దేవుడు తన అనుగ్రహమును వర్షించును
రాత్రి వేళ నేను ఆయనను స్తుతించెదను

అందరు : నేను ప్రభువును నమ్మెదను
నా రక్షకుడైన దేవుని నేను కీర్తించెదను

గురువు : పిత, పుత్ర, పవిత్రాత్మలకు మహిమ కలుగును గాక

అందరు : ఆదిలో వలె అంత్యము వరకు, ఆమెన్.

గురువు : (కానోన) ఒకడు నీటి వలన ఆత్మ వలన జన్మించిననే తప్ప, దేవుని రాజ్యములో ప్రవేశింపలేడు

పరిచార : ప్రార్థించుదము సమాధానము మనతో ఉండును గాక.

గురువు అభ్యర్థి/అభ్యర్థుల తలపై చేతులను చాపి ప్రార్థింతురు

గురువు : "అడుగుడు మీకొసగబడును, వెదకుడు మీకు దొరకును, తట్టుడు మీకు తెరువబడును" అని పలికిన ప్రభువా, మీ కరుణాపూరిత వాగ్దానమును అభ్యర్థి/అభ్యర్థుల లో నెరవేర్చండి. జ్ఞానస్నాన జలముతో పాపకళంకములను కడుగుకొని మీ కృపచే ఈ అభ్యర్థి/అభ్యర్థులు నూతన జన్మమును పొందును గాక. మీ నిగూఢ శరీరములో అవయవమగు ఈ అభ్యర్థి/అభ్యర్థులు సంస్కార స్వీకరణ ద్వారా ఆధ్యాత్మికముగా, శారీరకముగా అభివృద్ధి చెంద అనుగ్రహమును దయచేయండి. ఈ దానములకై ఈ అభ్యర్థి/ అభ్యర్థుల తో కలసి మీకు కృతజ్ఞతా వందనములు అర్పించు చున్నాము. ఇప్పుడును, ఎప్పుడును, + ఎల్లప్పుడును.

అందరు : ఆమెన్.

గురువు క్రింది ప్రశ్నలు అడుగుదురు

అభ్యర్థి/అభ్యర్థులు శిశువులైతే జ్ఞానతల్లిదండ్రులు పిల్లల కొరకు జవాబివ్వాలి. అభ్యర్థి/ అభ్యర్థులు వయోజనులైతే వారికి వారే జవాబివ్వాలి

గురువు : సైతాను బానిసత్వము నుండి నీవు/మీరు విడుదల పొందగోరుచున్నావా/పొందగోరుచున్నారా?

జవాబు : పొందగోరుచున్నాను/పొందగోరుచున్నాము

గురువు : పాపమును పాప మార్గములను నీవు పరిత్యజించుచున్నావా?/మీరు పరిత్యజించుచున్నారా?

జవాబు : పరిత్యజించుచున్నాను/పరిత్యజించుచున్నాము.

గురువు : యేసు క్రీస్తును నీ/మీ రక్షకునిగా స్వీకరించుచున్నావా?/ స్వీకరించుచున్నారా?

జవాబు : స్వీకరించుచున్నాను/స్వీకరించుచున్నాము

## ప్రథమ లేపనము

గత జ్ఞానస్నానములో ఉపయోగించిన తైలముతో ప్రథమ లేపనము చేయవలెను. గురువు అభ్యర్థి/అభ్యర్థుల నొసట తైలముతో సిలువ గుర్తు వేయుచు ప్రార్థింతురు.

గురువు : పిత, పుత్ర + పవిత్రాత్మ నామమున (పేరు.....) ఈ తైలముతో ముద్రింపబడి ఉన్నాడు/ముద్రింపబడి ఉన్నది.

అందరు: ఆమెన్.

అందరు లేపనానంతరం ప్రదక్షిణముగా వచన వేదికను సమీపించుచుండగా క్రింది గీతం ఆలపింపబడును

### కీర్తన 84

ప్రభువా మహా రారాజా
ఎంత విశిష్టం నీ భవనం
మీ తిరుసన్నిధి చేరగను
ఆత్మయు నిత్యం ఆశించును

సజీవ దేవుని గీతములు
వైభవ కీర్తన గానములు
మీ తిరు చిత్తము అధరములు
గానము చేయును సామోదం

సైన్యములకు ప్రభు దేవా
ఆలించండి ప్రార్థనలు
పితరులు యాకోబుని దేవా
దయతో మా మొర వినుమయ్యా

పరిపాలించే కవచముతో
సంరక్షించే సకలేశా
మీ సంరక్షణ నందించి
మీ అభిషిక్తుని రక్షించు

పరిచార: ప్రార్థించుదము సమాధానము మనతో ఉండును గాక.

గురువు : మా ప్రభువైన దేవా, మీ ప్రేమ పరిమళము మమ్మావరించి, మీ సత్యజ్ఞానముతో మా ఆత్మలను ప్రకాశింప చేయగా పరలోకము నుండి ప్రత్యక్షమగు మీ దివ్య కుమారుని స్వీకరింప మమ్ము అనుగ్రహించండి. సకల సౌభాగ్యములతో, మేలులతో అలంకరింపబడిన శ్రీసభలో నిత్యము మిమ్ము స్తుతించి మహిమపరచ మమ్ము యోగ్యులను చేయండి. ఏలయన మీరు సకలమునకు సృష్టికర్తయై యున్నారు. సదా సకలమునకు నాథా.

అందరు: ఆమెన్

సకలమునకు ప్రభుదేవా
మేము మిమ్ము స్తుతించెదము
యేసు నాథా వినయముతో
ఆరాధించి పొగడెదము

మా దేహములకు ఉత్థానం
మా ఆత్మలకు నవజీవం
ఒసగే ప్రభువా ధన్యుడవు
ఆరాధించి పొగెడదము

లేక

అందరు : సకలమునకు ప్రభువా, మిమ్ము మేము స్తుతించు చున్నాము. యేసు క్రీస్తువా, మిమ్ము మేము మహిమ పరుచు చున్నాము. ఏలయన, మీరు మా శరీరములను జీవముతో లేపు వారును, ఆత్మలను రక్షించువారునై యున్నారు.

పరిచార : ప్రార్థించుదము సమాధానము మనతో ఉండును గాక.

గురువు : నా ప్రభువా, నిజముగా మీరు మా శరీరములను లేపువారును, ఆత్మలను రక్షించు వారును, జీవమును నిత్యము పాలించు వారునై యున్నారు. మీకు నిరంతరము కృతజ్ఞత, ఆరాధన, స్తుతులు చెల్లించుట మా కర్తవ్యము, సదా సకలమునకు నాథా.

అందరు : ఆమెన్.

పరిచార : గళములెత్తి పాడుదము
కలిసి మనము పాడుదము
అనవరతం జీవించు
సర్వేశ్వరుని స్తుతియించెదము

అందరు : పరిశుద్ధుడైన ప్రభుదేవా
పరిశుద్ధుడైన బలవంతుడా
పరిశుద్ధుడైన అమరుండా
మాపై దయగా నుండండి

లేక

పరిచార : సహోదరీ సహోదరులారా ! గళమెత్తి మీరు సజీవుడైన దేవుని కీర్తించండి.

అందరు : పరిశుద్ధుడైన దేవా, పరిశుద్ధుడైన బలవంతుడా, పరిశుద్ధుడైన అమరుడా, మాపై దయచూపండి.

పరిచార : ప్రార్థించుదము సమాధానము మనతో ఉండును గాక.

గురువు : పరిశుద్ధుడు, స్తుతి పాత్రుడు, బలవంతుడు అమరుడవైన ప్రభువా, పరిశుద్ధులలో ప్రీతివంతుడై నివసించు మీరు, మీ స్వభావమునకు అనుగుణముగా మమ్ము కటాక్షించి, అనుగ్రహించి మాపై కరుణ చూపండి. సదా పిత, పుత్ర, పవిత్రాత్మ సర్వేశ్వరా.

అందరు: ఆమెన్

**మొదటి పఠనము**

**ఆదికాండము 12,1-4**

**రెండవ పఠనము**

**యెహెజ్కేలు గ్రంథము 36,24-28**

గురువు : అంబరమనవరతం
దైవ మహిమలను
పొగడి పాడును
ఆత్మతో జనించు గీతములు
హల్లేలూయ గీతములు
యేసు ప్రభుని జ్ఞానస్నానపు
నిర్మలమైన వేడుకలు
కొనియాడున్ నేడీ వేదికలో

పరిచార : ప్రకృతి విధానములు
ప్రభు కరవైభమున్
వెల్లడి చేయును

అందరు : ఆత్మతో జనించు...

పరిచార : పూవెలుగుల పగలు
అవిరామం ప్రభుని
మహిమను పాడును

అందరు : ఆత్మతో జనించు...

గురువు : నిత్యుండయిన పిత
సుత పరిశుద్ధాత్మకు
స్తుతి కలుగును గాక

అందరు : ఆత్మతో జనించు...

పరిచార : ఆదిలో ఉన్నట్లు
ఇప్పుడు, ఎల్లప్పుడు
అనవరతం ఆమెన్.

అందరు : ఆత్మతో జనించు...

పరిచార : ప్రార్థించుదము సమాధానము మనతో ఉండును గాక.

గురువు : మా ప్రభువైన దేవా, జీవదాయకమును, దైవీకమునైన మీ దివ్య సందేశము నాలకించి గ్రహించుటకు, మా బుద్ధిని ప్రకాశింప జేయండి. ఆత్మ శరీరములకవసరమగు ప్రేమ, ఆశాభావము, రక్షణ మాలో ఫలించుటకును, నిరంతరము మేము మిమ్ము స్తుతించుటకును, మీ కారణ్యానుగ్రహములచే మాకు తోడ్పడండి. సదా పిత, పుత్ర, పవిత్రాత్మ సర్వేశ్వరా.

అందరు: ఆమెన్.

## మూడవ పఠనము

## రోమా 6, 3-11 లేక గలతీ 3, 26-29

## సువిశేషగీతం

యేసు దేవుని వచనం
తిరువచనం సంలిఖితం
శ్రీ యేసు దేవుని శుభ వచనం
పరిశుద్ధాత్మ నివేశంతో
యూదయా సభలో మత్తాయి
రోమియులకు మార్కును
ఐగుప్తీయులకు లూకాయు
ఎఫెసీయులకు యోహాను
వ్రాసిరిగా హల్లేలూయ
తరతరముల్ పఠించునుగా
సాదరమీ తిరు గ్రంథం
ప్రభు మహిమలను అనవరతం
మహిలో పాడి పొగడెదము.

పరిచార: మనమందరము భక్తి శ్రద్ధలతో పవిత్ర సువిశేషమును ఆలకించెదము.

గురువు : సమాధానము + మీతో ఉండును గాక.

అందరు: మీతోను మీ ఆత్మతోను ఉండును గాక.

## సువిశేషము

## యోహాను 3, 1-8 (లేక) మత్తయి 3, 13-17

## ప్రసంగం

## వేడుదల

పరిచార : జ్ఞానస్నానము ద్వారా దైవ పుత్రుడు /పుత్రిక /పుత్రులు అగు ఈ దాసుడిని/దాసిని/దాసులను సమర్పించుచు ఈ విధమున ప్రార్థన చేయుదుము, ప్రభువా మాపై దయ చూపండి.

అందరు : ప్రభువా మాపై దయ చూపండి

పరిచార : ఒకడు నీటి వలన, ఆత్మ వలన జన్మించననే తప్ప దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని పలికిన ప్రభువా, జ్ఞానస్నానము ద్వారా మరల జన్మించి దైవ పుత్రుడు/ పుత్రిక/పుత్రులు అగు వరమును ఈ దాసునికి/దాసికి/ దాసులకు దయ చేయుమని మిమ్ము మేము ప్రార్థించు చున్నాము.

అందరు : ప్రభువా మాపై దయ చూపండి.

పరిచార : యోర్దాను నదిలో జ్ఞానస్నానము పొంది, వినమ్రత మాదిరిని మాకు చూపించిన ప్రభువా, దైవ చిత్తమును నెరవేర్చి జీవించు అనుగ్రహమును ఈ దాసునికి/దాసికి/ దాసులకు దయచేయుమని మిమ్ము మేము ప్రార్థించు చున్నాము.

అందరు : ప్రభువా మాపై దయ చూపండి

పరిచార : మా కొరకు మరణించి, సమాధి చేయబడి మహిమతో మరల లేచిన ప్రభువా, పాపమునకు మరణించి నూతన జీవము పొందబోవు ఈ దాసుని/దాసిని/దాసులను దీవించుమని మిమ్ము మేము ప్రార్థించుచున్నాము.

అందరు : ప్రభువా మాపై దయ చూపండి

పరిచార : పవిత్రాత్మకు ఆలయముగా మారాలనే కోరికతో మీ దరి చేరిన ఈ దాసుడిని/దాసిని/దాసులను పవిత్ర మార్గములో నడిపించుమని మిమ్ము మేము ప్రార్థించు చున్నాము.

అందరు : ప్రభువా మాపై దయ చూపండి

పరిచార : శ్రీ సభలో సభ్యుడిగా/సభ్యురాలిగా/సభ్యులుగా ఉండుటకు పిలువబడిన ఈ దాసునికి/దాసికి/దాసులకు ఆధ్యాత్మికమును, శారీరకమునైన సకల మేలుల నొసగి దీవించుమని మిమ్ము మేము ప్రార్థించుచున్నము.

అందరు : ప్రభువా మాపై దయ చూపండి

పరిచార : తల్లిదండ్రులకు ఆశాకేంద్రము, కుటుంబమునకు ప్రకాశము, దేశమునకు సేవా మాతృక అగు విధమున ఈ అభ్యర్థి/అభ్యర్థులను పోషించు కృపావరములను ఇతని/ఈమె/వీరి తల్లిదండ్రులకు, జ్ఞాన తల్లిదండ్రులకు దయచేయమని మిమ్ము మేము ప్రార్థించుచున్నాము.

అందరు : ప్రభువా మాపై దయ చూపండి

పరిచార : క్రీస్తు యొక్క శ్రీసభకు అధిపతియైన (పేరు) పాపు గారి కొరకు, మా అతిశ్రేష్ఠ పీఠాధిపతులు (పేరు) గారి కొరకు, మా పీఠాధిపతులు (పేరు) గారి కొరకు, తదితర పీఠాధిపతుల కొరకు వారి సహసేవకుల కొరకు మిమ్ము మేము ప్రార్థించుచున్నాము.

అందరు : ప్రభువా మాపై దయ చూపండి

పరిచార : పిత, పుత్ర, పవిత్రాత్మలకు మనలను సమర్పించుకొందము.

అందరు : మా దేవుడైన ప్రభువా, మీకు మమ్ము సమర్పించు కొనుచున్నాము.

గురువు : సకల జాతి జనులకు సువార్తను ప్రకటించుచు, వారిని శిష్యులుగా మార్చి, జ్ఞానస్నానము ఇవ్వమని ఆదేశించిన ప్రభువా, మీ ఆజ్ఞలను అనుసరించి జీవింప మమ్ము కరుణించండి. భువియందు దైవరాజ్యము స్థాపింప మీరు నియమించిన శ్రీసభ, మా ద్వారా ఆ కార్యమును సంపూర్ణమొనర్చును గాక. సమస్త మానవాళి ఒకే కాపరి ఆధీనంలో ఉండి, ఒకే ఆలయంలో సమావేశమగు రక్షణ దినం సత్వరమే వచ్చును గాక. మేము నిర్వహించు ఈ పవిత్ర సంస్కారము ఈ దాసునికి/దాసికి/దాసులకు పవిత్రాత్మ చైతన్యముచే నిత్యజీవపు కవాటమగును గాక. సదా సకలమునకు నాథా

అందరు : ఆమెన్.

పరిచార : ప్రభువా ఆశీర్వదించండి. సహోదరులారా తలలు వంచి దేవుని ఆశీర్వాదమును స్వీకరించండి.

గురువు : ప్రభువా శక్తిమంతుడవైన దేవా, మీ అభిషిక్తుడు కఠినమైన శ్రమలననుభవించి సాధించిన మీ పరిశుద్ధ కతోలిక శ్రీసభ మీకు స్వంతమైయున్నది. దైవస్వభావమునందు మీతో ఏకమైయున్న పవిత్రాత్మ కృపావరములచే హస్తనిక్షేపణ ద్వారా యథార్థ యాజక పదవులు ఒసగబడుచున్నవి. విశ్వాసులకు ఆధ్యాత్మిక సేవలందించుటకు శ్రీసభా పవిత్ర శరీరములో ప్రత్యేక అవయవములగుటకు బలహీనులమైన మమ్ము మీ అపార కనికరముతో యోగ్యులను చేసియున్నారు. ప్రభువా, మీ కృపానుగ్రహములతో మమ్ము నింపండి. మీ దానములను మా హస్తముల ద్వారా వర్షింప చేయండి. మీ దయానుగ్రహములను మాపైనను మీరు ఎన్నుకొనిన ఈ ప్రజల పైనను కుమ్మరించండి.

గురువు : కరుణా స్వరూపుడవైన దేవా, మేమందరము కలిసి మమ్ము మీతో సఖ్యపరచు సత్క్రియలచే జీవితమంత సముచితముగా మిమ్ము సంతుష్టులను చేయ మమ్ము అనుగ్రహించండి. నిరంతరము మీకు స్తుతి, గౌరవము, ఆరాధన, కృతజ్ఞతా వందనములు సమర్పింప మమ్ము యోగ్యులను చేయండి. సదా పిత, పుత్ర, పవిత్రాత్మ సర్వేశ్వరా

అందరు : ఆమెన్

## విశ్వాస ప్రకటన

విశ్వాస సంగ్రహం ఇక్కడ చెప్పబడుతున్నందువలన
దివ్యబలిలో మరల చెప్పనక్కరలేదు.

ప్రకటన: మనమందరం అభ్యర్థితో/అభ్యర్థులతో పాటు మన విశ్వాసాన్ని ప్రకటించుకుందాం.

గురువు : సర్వశక్తిగల పితయైన ఏక దేవుని మేము విశ్వసించుచున్నాము.

అందరు : దృశ్యమును అదృశ్యమునైన సకలమునకు కర్తయైన దేవుని మేము విశ్వసించుచున్నాము. దేవుని ఏకైక సుతుడును, సకల సృష్టిజాలమునకు ముందున్న ఆద్యజాతుడును, యుగయుగములకు పూర్వమే పిత నుండి జన్మించినవాడును, సృష్టింపబడనివాడును, ఒకే ప్రభువునైన యేసు క్రీస్తును మేము విశ్వసించుచున్నాము. ఆయన సత్య దేవుని నుండి వచ్చిన సత్య దేవుడు. పితతో ఏక స్వభావమును కలిగియున్నవాడు. ఆయన ద్వారా ప్రపంచము ఏర్పరచబడినది. సమస్తము సృష్టింపబడినది. మానవులమైన మన కొరకు మన రక్షణ కొరకు ఆయన పరలోకము నుండి దిగి వచ్చి పవిత్రాత్మ వలన కన్యమరియమ్మ నుండి శరీరమును స్వీకరించి మానవుడై జన్మించెను. పోన్సియు

పిలాతుని కాలమున శ్రమలననుభవించి, సిలువపై కొట్టబడి మరణించి సమాధి చేయబడి వ్రాయబడిన ప్రకారము మూడవ నాడు పునరుత్థానమయ్యెను. ఆయన పరలోకమునకెక్కి, పితయొక్క కుడి ప్రక్కన కూర్చొనియున్నారు. మృతులకును జీవితులకును తీర్పు తీర్చుటకు మరల వచ్చును. పిత - సుతుల నుండి బయలుదేరు సత్యాత్మయు జీవదాతయునైన ఒకే పవిత్రాత్మను మేము విశ్వసించుచున్నాము. ఏకైక, పవిత్ర, అపొస్తోలిక, కతోలిక శ్రీసభను మేము విశ్వసించుచున్నాము. పాప విమోచనమునొసగు ఒకే జ్ఞానస్నానమును శరీరము యొక్క పునరుత్థానమును, నిత్యజీవమును మేము విశ్వసించుచున్నాము. ఆమెన్.

## జ్ఞానస్నాన తొట్టిని చేరిన తరువాత

పరిచార : సోదరులారా, దైవిక జీవమునొసగు పరిశుద్ధ జ్ఞానస్నాన పరిచర్యకు సిద్ధమగునట్లు గురువు తన కొరకు తాను ప్రార్థించబోవుచున్నారు. మనమందరము భక్తిశ్రద్ధలతో నిశ్శబ్దముగా ప్రార్థించుదము.

గురువు : తప్పిపోయిన వారిని వెదకి కనుగొని, చెల్లాచెదరైన వారిని ఏకం చేయు ప్రభువా, మీ శ్రీసభలో యాజక సేవలందింప దీనుడైన ఈ దాసుని ఎన్నుకొని యున్నారు. సకల నీతిని సంపూర్ణ మొనర్చుటకు యోర్దాను నదిలో యోహానుచే జ్ఞానస్నానమును స్వీకరించి, జ్ఞానస్నానమొసగుటకు అపోస్తలులను నియమించిన ప్రభువా, ఈ సంస్కారమును యథావిధిగా నిర్వహించుటకు నన్ను యోగ్యుని చేయండి. సదా సకలమునకు నాథా.

అందరు : ఆమెన్.

## తైల, జలములాశీర్వాదము

### తైలాశీర్వాదము

గురువు : మా ప్రభువైన దేవా, మీ పవిత్రాత్మ వేంచేసివచ్చి ఈ తైలమును ఆవహించి ఆశీర్వదించును గాక. ఆరాధనీయ త్రియేక దేవుని నామములో క్రీస్తు శ్రమల పునరుత్థాన సంకేతమైన జ్ఞానస్నాన పరిచర్య కొరకు ఈ తైలము + పవిత్ర పరచబడును గాక. ఈ తైలము మాకు జీవపు గుర్తుగా ఉండును గాక. మీ ప్రియ కుమారుడు, మా రక్షకుడైన యేసు క్రీస్తు ద్వారా సంపూర్ణ మొనర్చబడు జ్ఞానస్నానము మూలమున మాకు పరిపూర్ణ పవిత్రత, పరలోక సౌభాగ్యము, ఆయన యాజకత్వములో భాగస్వామ్యము లభించును గాక. మేము మీకు, మీ ప్రియకుమారునికి, పవిత్రాత్మకు స్తుతి, మహిమ, కృతజ్ఞత, ఆరాధనలు సమర్పించుచున్నాము. ఇప్పుడును, ఎప్పుడును + ఎల్లప్పుడును.

అందరు : ఆమెన్

గురువు తైలమును ఆశీర్వదించును.

గురువు పవిత్ర మూరోనుతో తైలముపై సిలువ గుర్తు వేయును.

గురువు : పాపవిమోచక జ్ఞానస్నాన మందు, అమర్త్యతా చిహ్నము అగుటకు ఈ తైలము, పవిత్ర మూరోనుతో ముద్రింపబడి, పవిత్ర పరచబడి, పరస్పరము మిళితము చేయబడినది. పిత, పుత్ర + పవిత్రాత్మ నామమున.

అందరు : ఆమెన్

## జలాశీర్వాదము

గురువు : ప్రభువైన దేవా, యోర్దాను నదిలో జ్ఞానస్నానము పొందినప్పుడు క్రీస్తుపై వేంచేసి వచ్చిన పవిత్రాత్మ, మానవ స్వభావమును నూత్నీకరించు చేయు దివ్యాత్మ, ఈ జలముపై వేంచేసి వచ్చును గాక. పవిత్రాత్మ ఆవహించు ఈ జలము వలన జ్ఞానస్నానము పొందు వారికి రక్షణ లభించును గాక. శరీరాత్మల యందు పవిత్ర పరచబడి మీకు స్తుతి, గౌరవము, కృతజ్ఞతలు సమర్పింప మేము యోగ్యులమగుదుము గాక. ఇప్పుడును, ఎప్పుడును + ఎల్లప్పుడును.

అందరు : ఆమెన్.

గురువు జలమును ఆశీర్వదించును.

గురువు పవిత్ర మూరోనుతో జలముపై సిలువ గుర్తు వేయును

గురువు : జ్ఞానస్నానము ద్వారా పాపక్షమాపణనను గ్రహించి, ఆధ్యాత్మిక జన్మమునొసగు నూతన ఉదరమగుటకు ఈ జలము పిత, పుత్ర + పవిత్రాత్మ నామమున ఆశీర్వదించబడి పవిత్ర తైలముతో మిళితము చేయబడినది.

అందరు : ఆమెన్.

## రెండవ లేపనము

ఈ జ్ఞానస్నానములో ఆశీర్వదించిన తైలముతో లేపనము చేయవలెను. శిశువులకు ఛాతిపై, పెద్దలకు నొసటపై గురువు తైలము పూయుదురు.

గురువు : పిత, పుత్ర + పవిత్రాత్మ నామమున (పేరు.......) పవిత్ర తైలముతో లేపనము చేయబడుచున్నాడు(చున్నది).

అందరు : ఆమెన్.

## జ్ఞానస్నానము

గురువు : పిత +

అందరు : ఆమెన్

గురువు : పుత్ర +

అందరు : ఆమెన్

గురువు : పవిత్రాత్మ నామమున + (పేరు..........) జ్ఞానస్నానము చేయించబడుచున్నాడు/చేయించబడుచున్నది.

అందరు : ఆమెన్.

## తెల్లటి వస్త్ర ప్రదానం

గురువు : మన ప్రభువైన క్రీస్తు నిన్ను పవిత్ర వస్త్రముతో అలంకరించి నిష్కళంకముగా జీవింప నీకు తోడ్పడును గాక.

అందరు : ఆమెన్.

గురువు అభ్యర్థికి తెల్లటి వస్త్రమును ఇచ్చును

## క్రొవ్వొత్తి ప్రదానం

గురువు : లోకమునకు వెలుగైన క్రీస్తు నీకు మార్గదీపమగును గాక.

అందరు : ఆమెన్

గురువు అభ్యర్థికి వెలిగించిన క్రొవ్వొత్తిని ఇచ్చును.

## పవిత్ర గ్రంథ ప్రదానం

గురువు : దైవవాక్కుననుసరించి జీవింప, దేవుడు నిన్ను దీవించును గాక.

గురువు పవిత్ర గ్రంథము ఇచ్చును

## తైలాభిషేకము (ధృవీకరణ సంస్కారము)

తైలాభిషేకమునకు సిద్ధమగుటకు వేడుదల చెప్పబడును

**వేడుదల**

పరిచార : జ్ఞానస్నానము ద్వారా దైవ పుత్రుడై/పుత్రికై/పుత్రులై, పవిత్రాత్మ వరములను నిరీక్షించు ఈ దాసుని/ దాసి/ దాసుల కొరకు ఈ విధమున ప్రార్థించుదము, ప్రభువా, మా ప్రార్థన ఆలకించండి.

అందరు : ప్రభువా, మా ప్రార్థన ఆలకించండి.

పరిచార : సీయోను శాలలో ప్రార్థనానిరతులై యున్న శిష్యులపైకి పవిత్రాత్మను పంపినట్లు, ఈ దాసుని/దాసి/దాసుల పైకి పవిత్రాత్మను పంపుమని మిమ్ము మేము ప్రార్థించు చున్నాము.

అందరు : ప్రభువా, మా ప్రార్థన ఆలకించండి.

పరిచార : మీ చైతన్యముచే నింపబడి, పవిత్ర జీవితము జీవించుటకు అన్ని వేళల విశ్వాసము నందు స్థిరముగా నుండి మిమ్ము మహిమ పరచుటకు ఇతనికి/ఈమెకు/వీరికి శక్తిని దయ చేయుమని మిమ్ము మేము ప్రార్థించు చున్నాము.

అందరు : ప్రభువా, మా ప్రార్థన ఆలకించండి.

పరిచార : క్రైస్తవ విశ్వాసములో పెంచి పోషించు ఇతని/ఈమె/వీరి తల్లిదండ్రులను, గురువులను, శ్రేయోభిలాషులను పవిత్రాత్మతో నింపుమని మిమ్ము మేము ప్రార్థించు చున్నాము.

అందరు : ప్రభువా, మా ప్రార్థన ఆలకించండి.

పరిచార : పిత, పుత్ర, పవిత్రాత్మలకు మనలకు సమర్పించు కొందము

అందరు : మా దేవుడైన ప్రభువా, మీకు మమ్ము సమర్పించు
కొనుచున్నాము.

గురువు : ప్రభువా శక్తిమంతుడవైన దేవా, మిమ్ము మేము వినయపూర్వకముగా ప్రార్థించుచున్నాము. మీ ఆత్మతో ఈ దాసుని/దాసిని/దాసులను నింపండి. జీవిత సంపూర్ణతలోకి ఇతడు/ఈమె ఎదుగును గాక (వీరు ఎదుగుదురు గాక). ఐశ్వర్య కాలములో మిమ్ము విస్మరింప కుండుటకు, కష్ట కాలములో మిమ్ము ఆశ్రయించుటకు ఇతనికి/ఈమెకు/వీరికి శక్తిని దయచేయండి. ఈ లోకములో మీకు సజీవ సాక్షిగా జీవించి, మరణానంతరం నిత్య సౌభాగ్యము అనుభవింప ఈ దాసునికి/దాసికి/దాసులకు తోడ్పడండి. సదా పిత, పుత్ర, పవిత్రాత్మ సర్వేశ్వరా

అందరు : ఆమెన్

గురువు క్రింది ప్రశ్నను అడుగుదురు. అభ్యర్థి/అభ్యర్థులు శిశువులైతే జ్ఞాన తల్లిదండ్రులు, అభ్యర్థి/అభ్యర్థులు వయోజనులైతే వారికి వారే జవాబివ్వాలి

గురువు : పవిత్రాత్మ పూరితుడవై/పూరితురాలవై/పూరితులై విశ్వాసమునందు స్థిరముగా నుండి, క్రీస్తుకు సాక్ష్యమివ్వ కోరుచున్నావా?/సాక్ష్యమివ్వ కోరుచున్నారా?

జవాబు : నేను కోరుచున్నాను.

గురువు : దేవుడు నిన్ను దీవించును గాక

అందరు పవిత్రాత్మ గీతము ఆలపింతురు

## పవిత్రాత్మ గీతములు

### గీతం - 1

పరలోకం తెరచి పావుర రూపమై దేవా దిగిరావా మమ్ము బలపరచగ రావా
యోర్దాన్ నదిలోని అనుభవము - అట్లే ఇక్కడ జరుగనిమ్ము ॥2॥

1. వరములు ఫలములు ఒసగి మమ్ము-పరిశుద్ధ పరచగ దిగిరావా
2. నూతన జీవం ఒసగి మమ్ము-యేసుని రూపంగా మలచుమయ్యా

## గీతం - 2

ప్రభు వాగ్దానమై వచ్చిన - అపోస్తల్ల నుజ్జీవించిన
ఓ దేవుని ఆత్మమా - మాపైనను వర్షించు వరములు
ప్రేమను పెంచి పోషించిన - శాంతిని వ్యాపింప చేయ
కుమిలిన హృదిలో నూతన - జీవమునిచ్చి మేల్కొలుపుమా
మబ్బులు కమ్మి నీరసించిన - మానసమందాశ కలుగ
ఏడ్చి మక్కిన కంటిలో - కాంతిని విరజిమ్మ చేయుమా
వడలి వాడి పోతూ ఉన్న - తరువుకు చిరుగాలి తగిలి
మరలా చిగురులు తొడిగి - చక్కగ నొప్పనీయుమా

## గీతం - 3

శిష్యుల మీద దిగివచ్చిన పరిశుద్ధాత్ముడా
అభిషేకపు అగ్నిచే మమ్ము నింపుమా ఓ దేవా
ఆత్ముడా దిగిరావయ్యా దానవరములన్ కురిపించు ॥2॥
1. పెంతకోస్తునాడు సెహియోన్ శాలలో శిష్యుల మీద దిగినట్లు
వ్యాధుల వలన సతమతమయ్యే మా మీదను దిగిరమ్ము
ఆత్ముడా దిగిరావయ్యా దానవరములన్ కురిపించు ॥2॥
2. ఆదిమ సభను వర వర్షంతో అనుదినం మీరు నయించినట్లు
సువిశేషపు సాక్షులగుటకు తిరుసభను నేడు మేల్కొలుపు
ఆత్ముడా దిగిరావయ్యా దానవరములన్ కురిపించు ॥2॥

పవిత్రాత్మ గీతం తరువాత పరిచారకుడు ఈ క్రింది ప్రార్థన చేయును

పరిచార : సహోదరులారా, గురువు పవిత్రాత్మ కృపావర సంపూర్ణతచే ఈ దాసుని/దాసిని/దాసులను ముద్రింప సంసిద్ధము అగుటకు తన కొరకు ప్రార్థింపబోవుచున్నారు.
మనమందరము భక్తి శ్రద్ధలతో నిశ్శబ్దముగా ప్రార్థించుదము.

గురువు : ప్రభువా శక్తిమంతుడవైన దేవా, అపోస్తలుల పైకి పవిత్రాత్మను పంపి వారిని బలపరచిన మీ అనంత కారుణ్యమునకై మీకు వందనములర్పించుచున్నాము. అపోస్తలులు, వారి వారసుల హస్తనిక్షేపణ ద్వారా పవిత్రాత్మ దానములను నేటికి శ్రీసభలో వర్షింపచేయుచున్న మీరు, ఈ దివ్యదానములను మీ దాసునికి/దాసికి/దాసులకు ప్రసాదించుటకు అయోగ్యుడనైన నన్ను యోగ్యునిగా చేయండి. సదా పిత, పుత్ర, పవిత్రాత్మ సర్వేశ్వరా.

అందరు : ఆమెన్.

## హస్త నిక్షేపణ ప్రార్థన

గురువు రెండు చేతులను అభ్యర్థి/అభ్యర్థుల వైపు చాపి ప్రార్థింతురు

గురువు : జ్ఞానస్నానము ద్వారా నూతన జన్మమును, క్రీస్తు దేహములో భాగస్వామ్యమును, నిత్యజీవమునకు వారసత్వమును మాకు ప్రసాదించిన తండ్రియైన దేవా, వాగ్దానము చేయబడిన పవిత్రాత్మచే ఈ దాసుని/దాసిని/దాసులను ముద్రించండి. "తండ్రీ" అని మిమ్ము సంబోధించు దత్తపుత్రత్వమునొసగు ఆత్మను ఈ దాసునికి/దాసికి/దాసులకు అనుగ్రహించండి. హస్తనిక్షేపణ అనుష్ఠానము ద్వారా పవిత్రాత్మచే నింపబడి, ధైర్యముగా సువార్తకు సాక్ష్యమిచ్చుచు, శ్రీసభలో నమ్మకమైన దాసునిగా/దాసిగా/దాసులుగా జీవింప ఇతనికి/ఈమెకు/వీరికి శక్తినొసగండి. మీ పవిత్రాత్మ ఫలములైన ప్రేమ, ఆనందం, శాంతి, సహవాసం, దయ, మంచితనం, విశ్వసనీయత, సాత్వికత, నిగ్రహము ఈ దాసుని/దాసి/దాసుల లో సంపూర్ణమగును గాక. మీ అనుగ్రహముచే నిర్మలముగా జీవింప ఈ దాసునికి/దాసికి/దాసులకు తోడ్పడండి. మేము మీకు, మీ ప్రియ కుమారునికి, పవిత్రాత్మకు స్తుతి, మహిమ, ఆరాధనలు, సమర్పించుచున్నాము. ఇప్పుడును, ఎప్పుడును + ఎల్లప్పుడును. (గురువు అభ్యర్థిని ఆశీర్వదించును)

అందరు : ఆమెన్

## మూడవ లేపనము (ధ్రువీకరణ సంస్కారం)

గురువు పవిత్ర మూరోనుతో అభ్యర్థి నొసటిపై తైలముతో సిలువ గుర్తు వేస్తూ ప్రార్థించును.

గురువు : జ్ఞానస్నానము పొందిన (పేరు.....) పిత, పుత్ర + పవిత్రాత్మ నామమున పరిపూర్ణుడు (పరిపూర్ణురాలు) గా చేయబడి, స్థిరపరచబడియున్నాడు(యున్నది).

లేపనానంతరం క్రింది విధమున ప్రార్థింతురు

గురువు : ప్రభువైన దేవా, ఈ దాసుడు/దాసి/దాసులు స్వీకరించిన జీవదాయక ముద్ర, పవిత్రాత్మ కృపావర సంపూర్ణత, దాసుడు/దాసి/దాసులు ప్రారంభించిన నూతన జీవితము, ధరించిన నీతి కవచము శత్రు సైన్యముల బారినుండి ఈ దాసుని/దాసిని/దాసులను సంరక్షించును గాక. క్రీస్తుని దివ్య పరిమళం జీవిత మంతా వ్యాపింపచేయ ఇతనిని/ఈమెను/వీరిని అనుగ్రహించండి.

### కిరీటము ధరింప చేయుట

గురువు : ఆధ్యాత్మిక ఆనందము, నిత్య సౌభాగ్యములకు సంకేతముగా (పేరు....) పిత, పుత్ర, పవిత్రాత్మ నామమున జీవకిరీటము ధరింపచేయబడుచున్నాడు (చున్నది)

అందరు : ఆమెన్)

గురువు అభ్యర్థికి కిరీటము ధరింపచేయును

గురువు : జ్ఞానస్నాన పుత్రుడైన/పుత్రికైన/పుత్రులైన, ఇతనితో/ఈమెతో/వీరితో కలసి మనము దేవుని "తండ్రీ" అని పిలిచి ప్రార్థించుదము

గురువు : పరలోకమందున్న మా తండ్రీ...

దివ్యబలి ఉన్నచో “ప్రభువును నేను ధృఢముగా...” దివ్యబలి కొనసాగును.

## సమాపన ప్రార్థనలు

గురువు : ప్రభువైన దేవా, పాపములను పరిహరించు దివ్య గొర్రె పిల్లయైన యేసు పవిత్ర రక్తముచే మీరు ఇతనిని/ఈమెను/వీరిని కడిగి పవిత్ర పరచియున్నారు. పవిత్రాత్మను పంపెదను అన్న మా ప్రభువైన యేసు క్రీస్తు వాగ్దానము ఈ దాసుని/దాసి/దాసులలో నెరవేర్చినందులకు మీకు కృతజ్ఞతా వందనములు అర్పించుచున్నాము. మీ ఈ దాసుని/దాసిని/దాసులను క్రీస్తు సహభాగస్వామిగా/సహభాగస్వాములుగా, పవిత్రాత్మ కృపావర సంపన్నునిగా/సంపన్నురాలుగా/సంపన్నులుగా చేసినందులకు మీకు వందనములు అర్పించుచున్నాము. ఈ దాసుడు/దాసి/దాసులు సత్యమందును ఆత్మయందును మిమ్ము మహిమ పరచ అనుగ్రహమును దయచేయండి. సదా పిత, పుత్ర, పవిత్రాత్మ సర్వేశ్వరా.

అందరు: ఆమెన్, ప్రభువా ఆశీర్వదించండి.

గురువు : పరిశుద్ధ తల్లి కన్య మరియమ్మ, పునీత యోసేపు, అపోస్తులుల, మా తండ్రియైన పునీత తోమాసు, హతసాక్షుల, సకల పునీతుల, మా శ్రీ సభలోని పునీతుల, ధన్యుల, విచారణ పాలక పునీతుడు/పునీతురాలు (పేరు...) గారి ప్రార్థనలు ఇతనికి/ఈమెకు/వీరికి తోడగును గాక. ఇతని/ఈమె/వీరి నామకారుకులైన పాలక పునీతుడు/పునీతురాలు (పేరు...) గారి (పాలక పునీతుల) జీవిత మాతృక ఇతనికి/ఈమెకు/వీరికి మార్గదర్శకమగును గాక.

అందరు: ఆమెన్.

## సమాపనాశీర్వాదము

గురువు : జ్ఞానస్నానము ద్వారా దైవపుత్రుల స్థానమునకు మనలను లేవనెత్తిన దేవుడు స్తుతింపబడును గాక. శ్రీసభకు నమ్మకమైన పుత్రునిగా/పుత్రికగా/పుత్రులుగా జీవింప ఆయన మీకు తోడగునుగాక. పవిత్రాత్మను స్వీకరించిన నీవు/మీరు సదా సువార్తకు సాక్ష్యమిచ్చు సాహస సువార్తికునిగా/సువార్తికురాలిగా రూపొందుదువుగాక (సువార్తకులుగా రూపొందుదురుగాక). కనులతో చూడనట్టి, చెవులతో విననట్టి, హృదయముతో ఆస్వాదించనట్టి పరలోక సౌభాగ్యమునకు వారసుడు/వారసురాలు/వారసులు అగువరకు ఆపదలో సహాయమును, దు:ఖములో ఓదార్పును, శోధనలో శక్తిని ఒసగి దేవుడు మిమ్ము సంరక్షించును గాక. తల్లిదండ్రులకు ఆశాకేంద్రమును, కుటుంబమునకు ప్రకాశమును, దేశమునకు సేవా మాతృకను అగుటకు దేవుడు మిమ్ము యోగ్యునిగా/యోగ్యురాలిగా/యోగ్యులుగా చేయును గాక. ఈ పవిత్ర పరిచర్యలో పాల్గొనిన అందరిని దేవుడు సమృద్ధిగా దీవించునుగాక. ఇప్పుడును, ఎప్పుడును + ఎల్లప్పుడును.

అందరు : ఆమెన్

గురువు అందరిని ఆశీర్వదింతురు

గురువు : పవిత్ర పరచు బలిపీఠమా.....

